

స్వాగతం – సుస్వాగతం



బీర్ల అయిలయ్య
ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు
శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి
బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి
మరియు బ్రహ్మోత్సవాలకు విచ్చేయుచున్న
అతిరథమహారథులకు, భక్తులకు
స్వాగతం
సుస్వాగతం
గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్
మాజీ ఉపసర్పంచ్
యాదగిరిగుట్ట
5వ వార్డు కౌన్సిలర్
యాదాద్రి మున్సిపల్ ఫ్లోర్ లీడర్

'గుట్ట'లో మహాశివరాత్రి మహోత్సవాల పరిసమాప్తం

» యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి » యాదగిరిగుట్టలో భక్తుల సందడి » 30వేల మంది భక్తుల రాక » రూ.43,26,133నిత్య ఆదాయం

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని అనుబంధ రామలింగేశ్వరుడి శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు మహాపూర్ణాహుతి, త్రిశూల స్నాన ఘట్టాలతో పరిసమాప్తమయ్యాయి. శైవాగమ పద్ధతిలో పాంచాహ్నిక దీక్షతో ఈ నెల 5వ తేదీన మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. చివరిరోజైన ఆదివారం శివాలయంలోని రామలింగేశ్వరస్వామిని కొలుస్తూ నిత్య ఆరాధనలు, మూల మంత్రజపాలు, వేదపారాయణాలు, నందిసూక్త పఠనములను అర్చకబృందం, రుత్వికులు నిర్వహించారు. యాగశాలలో పంచసూక్త, నమక, చమక, రుద్ర పఠనాలతో హోమ పూజలు జరిపి మహాపూర్ణాహుతి వేడుకలకు తెరతీశారు. రుత్వికులు, వేదపండితులు, అర్చకబృందం వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ మహాపూర్ణాహుతి పర్వాలను శైవాగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సేవలో తీర్చిదిద్దిన అర్చకస్వాములు పరమశివుడి ఆయుధమైన శూలాన్ని మంగళవాయిద్యాలతో శివాలయంలో ఊరేగింపు నిర్వహించి కొండపైన విష్ణుపుష్కరిణిలో త్రిశూలతీర్థ స్నాన ఘట్టాలను నిర్వహించారు. సాయంత్రం వేద పారాయణాలు, చతుస్థానార్చనలు, సోమకుంభార్చనలు, మూల మంత్ర పఠనం నిర్వహించిన అర్చకులు రాత్రి సమయంలో మహోత్సవాల్లో అలసి సొలసిన ఆదిదంపతులు పార్వతీ, పరమేశ్వరులను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక సేవలో తీర్చిదిద్ది డోలారోహణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శివాలయ అర్చకులు, వేదపండితుల వేద పఠనం, మంగళ వాయిద్యాల మధ్య డోలారోహణ పర్వాలు శోభాయమానంగా సాగాయి. ఈ మహోత్సవాలను దేవస్థాన ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ, శివాలయ ప్రధానార్చకులు గౌరిభట్ల నరసింహరాములుశర్మ, అర్చక బృందం, రుత్వికులు నిర్వహించగా.. ఆలయ అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు పాల్గొన్నారు.



మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శివాలయ యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. 30వేల మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించారని, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.43,26,133 ఆదాయం సమకూరింది. స్వామికి నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి.

పేరూరులో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్,మార్చి 10: జిల్లా కేంద్రంలోని పానగల్లు ఛాయా, పచ్చల సోమేశ్వరస్వామి ఆలయాల్లో నాలుగురోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి.ఆదివారం ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గంట్ల అనంతరెడ్డి ఉత్సవాల్లో విశేషమైన సేవలందించిన వేదపండితులకు సంభావన అందించి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఉత్సవాలకు సహకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు,కమిటీ సభ్యులు హరిబాబు, పర్వతరెడ్డి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలియా: అనుముల మండలం పేరూరులోని భూసోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.



పేరూరులో పూజల్లో పాల్గొన్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ


యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖల వారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం



మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే

31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామనిమంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామసభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్ల లేకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

రామన్నపేట, మార్చి 10: రామన్నపేట మండలంలలోని సిరిపురం గ్రామంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ సహకారంతో మురికినీటిని శుద్ధి చేసి మంచినీటిని అందించే పైలట్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జెండగె హనుమంత్ కొండిబా, ఐఐటీ డైరెక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ పున్నలక్ష్మీజగన్మోహన్, నాయకులు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, గంగుల రాజిరెడ్డి, మల్లారెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : వీరేశం

రామన్నపేట, మార్చి 10: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని బాచుప్పల, యన్నారం, పల్లివాడ, నీర్నేముల, మునిపంపుల, లక్ష్మాపురం, కొత్తగూడెం గ్రామాలతోపాటు బోగారం గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అంచెలంచెలుగా గ్రామాల్లో సీసీరోడ్డు, మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, మాదూరి జ్యోతి, గాదె శోభారాణి, గుత్తా నర్సిరెడ్డి, కడమంచి సంధ్య, స్వామి పాల్గొన్నారు.

'పాడి రైతుల సంక్షేమమే మదర్‌డెయిరీ ధ్యేయం'

మోత్కూరు, మార్చి 10: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా మదర్‌డెయిరీ పని చేస్తోందని మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండలం లోని పాటిమట్ల పాలసంఘం సభ్యుడు బి.అయిలయ్య అనారోగ్యంతో మృతిచెం దాడు. అంత్యక్రియల నిమిత్తం మదర్ డెయిరీ (నార్ముల్)నుంచి మృతుడి భార్య మీనమ్మకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పాడి రైతులు తమ పాలను పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లోనే పోయాలన్నారు. ప్రైవేట్ డెయిరీలు ధరల విషయంలో కొంత వ్యత్యాసం చూపుతూ, వెన్న శాతం నమోదులో, బిల్లు చెల్లింపులో మోసం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు బి.నర్సిరెడ్డి, రఘుపతిరెడ్డి, ఎం.రాధాకిషన్‌రెడ్డి, వేతన కార్యదర్శి ఎం.విజయ్‌రెడ్డి, సూపర్‌వైజరు జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం



మంచినీటి క్యాన్లు అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్

భువనగిరి టౌన్, మార్చి 10: భువనగిరి పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారిస్తామని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అర్బన్‌కాలనీలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వేసవిలో యథావిధిగా నీటిని అందించే లక్ష్యంతో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ ఇప్పటి మాదిరిగానే వేసవిలోనూ తాగునీరు సరఫరా చేస్తామన్నారు. నీటిని పొదుపుగా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. పొలిశెట్టి ఫౌండేషన్ సమకూర్చిన నీటి క్యాన్లు పంపిణీ చేశారు. పునరుద్ధరించిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పొలిశెట్టి అనిల్‌కుమార్, బడుగు నర్సింహ, వస్తువుల శ్రీను, చెక్క ముత్యాలు, ఎండి అఫీజ్, దినేష్, నర్సింగ్‌రావు, వెంకటేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

మోత్కూరు: మోత్కూరు మునిసిపాలిటీలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. 9వ వార్డులో రూ.2.50లక్షలతో ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనులను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. తాగు నీటికి ఇబ్బంది ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు దబ్బెటి విజయరమేష్, పురుగుల వెంకన్న, కారుపోతుల శిరీష‌శ్రీనివాస్, మలిపెద్ది రజితరాంరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మస్వామి రాయుడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, కారుపోతుల వెంకట్, మెంట నగేష్, నిమ్మల శ్రీనివాస్, కృష్ణ, రాహుల్ పాల్గొన్నారు.

మహిళా కవయిత్రులకు సన్మానం

భువనగిరి టౌన్, మార్చి 10: హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా కవయిత్రులు పాల్గొన్నారు. రాష్ట్రపతి నిలయం ఆహ్వానం మేరకు కవయిత్రులు సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, వల్లాల విజయలక్ష్మి, మర్రి జయశ్రీ, రాపోలు అరుణ స్వామి, రాపోలు శ్రీదేవి, మిర్యాల లలిత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజిని ప్రియ, అక్షర వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మి, ఉమ్మడి జిల్లా కవయిత్రులను సత్కరించారు. సాహిత్య రంగానికి చేస్తున్న సేవలను అభినందించారు.

గుండాలను కరువు మండలంగా ప్రకటించాలి

గుండాల, మార్చి 10: గుండాలను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు మండలంలోని తుర్కలషాపురంలో ఎండిన పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని అసంపూర్తిగా వదిలేసిన దేవాలు కాల్వ పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. హరిశ్చంద్ర, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ మహిళలకు రక్షణ కల్పించాలి

వలిగొండ, మార్చి 10: మహిళా దివ్యాంగుల రక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని నేషనల్ ప్లాట్‌ఫాం ఫర్ రైట్స్ డిజబుల్(ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు ఎస్. ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సదస్సులో మాట్లాడారు. మహిళా దివ్యాంగుల పట్ల వివక్ష, వేధింపులు కొనసాగుతున్నా యన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎందుకు కృషిచేయడం లేదని ప్రశ్నించారు. దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం కుటీర పరిశ్రమను ఏర్పాటు చేయాలని మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం సంఘం మహిళా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కొత్త లలిత, కో కన్వీనర్లుగా పార్వతి, సరిత, మనోహర ఎన్నికయ్యారు.

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి : ఐద్వా

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 10: మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పుట్టపాకలో ఆదివారం జరిగిన మహిళా సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళలు హక్కులను కాపాడటంలో విఫలమయ్యాయని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు రోజు రోజుకూ పెరుగుతున్నా యన్నారు. ఉచితాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, ధరలు, టాక్స్‌ల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. పోరాటాల ద్వారానే మహిళా రిజ్వేషన్ల బిల్లు ముందడుగు వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, దోనూరి నిర్మల, పుట్టపాక ఎంపీటీసీ మర్రి వసంతనర్సిరెడ్డి, కేశిరెడ్డి జయమ్మ, దోంతగోని పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మనోహర్

భువనగిరి రూరల్, మార్చి 10: భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. భువనగిరి మండలం చీమలకొండూరు గ్రామానికి చెందిన బీట్కూరి మనోహర్, అదే గ్రామానికి చెందిన పల్లెర్ల భూమిక(19) ఫిబ్రవరి 17న యాదగిరిగుట్టలో మనోహర్, భూమిక కులాంతర వివాహం చేసుకున్నారు. అత్త స్వరూప వేధిస్తుండటంతో గ్రామపెద్దలు పంచాయితీ పెట్టి ఇరు కుటుంబాలను సముదాయించారు. అత్తతో పాటు భర్త కూడా తనను వేధిస్తున్నాడని తల్లిగారింటికి వెళ్లిన భూమిక ఈ నెల 6వ తేదీన ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ సందర్భంగా భూమిక కుటుంబసభ్యులు ఆందోళన చేయటంతో మనోహర్, కుటుంబసభ్యులు అడ్డగూడూరులో నివాసం ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లారు. శనివారం రాత్రి మనోహర్ ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుమలగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆదివారం సాయంత్రం చీమలకొండూరులో అత్తింటి వారి సంప్రదాయాలతో అత్త స్వరూప, మామ వెంకటేష్ భూమికకు అంత్యక్రియలు నిర్వహించారు. కోడలికి మామ వెంకటేష్ తలకొరివి పెట్టాడు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసి అంత్యక్రియలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

సారూ.. మా సమస్యలు పరిష్కరించరూ

● తమను ఆదుకోవాలంటున్న బస్వాపురం రిజర్వాయర్ బాధితులు, ● సమస్యలు ఏకరువు పెడుతున్న మండల ప్రజలు ● యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక



బస్వాపురం రిజర్వాయర్ కట్టపై బాధితుల వంటా వార్పు (ఫైల్)



లప్పానాయక్‌తండా బాధితులతో మాట్లాడుతున్న భట్టి (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రానికి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి విన్నవించుకుంటున్నారు. తమపై కరుణ చూపి సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

● బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురైన లప్పానాయక్‌తండాను కోల్పోయిన ప్రజలకు పది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు 90ఎకరాలకు రూ.1.63కోట్లు చెల్లించకపోవడం, 150మందికి ఆర్అండ్‌ఆర్ ప్యాకేజ్ ఇవ్వకపోవడంతో గిరిజనులు ఇళ్లు, భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● పాతగుట్ట చౌరస్తా నుంచి శ్రీ పాతలక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు 10 సంవత్సరాల నుంచి పూర్తిగా శిథిలమై జట్కాబండ్లు, వాహనాల్లో వెళ్లే భక్తులు, ప్రజలు ప్రమాదాలకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుకు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నారు.

● వైటీడీఏ అభివృద్ధిలో భాగంగా పాతగుట్ట చౌరస్తా నుంచి మెయిన్ రోడ్డుకు ఇరువైపున రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు, స్థలాలు కోల్పోయిన ప్రజలకు గత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి ప్రభుత్వం వైటీడీఏ ఆధీనంలో నిర్మాణం చేసిన దుకాణాల మడిగెలను 154 మందికి కేటాయించి వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చినా అవి ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

● వారికి స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో 200ల గజాలు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి తాత్కాలిక భూమి పత్రాలు ఇచ్చి అధికారులు, అప్పటి ప్రజాప్రతినిధులు చేతులు దులుపుకున్నారు. డిపోను తరలించడం లేదు. వారికి ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● స్థానిక సింహద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు గతం ప్రభుత్వం నిర్మాణం చేసిన ఫ్లైఓవర్‌తో స్థానిక రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు పూర్తిగా దెబ్బతిన్నారని దీంతో తొలగించి సమస్యను పరిష్కరిస్తారని ఎదురు చూస్తున్నారు.

● ప్రముఖ పుణ్యక్షేత్రంలో స్థానిక మునిసిపల్ నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని అప్పటి మంత్రులు ఎన్నో హామీలు ఇచ్చినా అది అమలు కాలేదు. మున్సిపల్ సొంత భవనం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● భక్తులకు, ప్రజలకు వైద్య సేవలు అందించడానికి కేవలం ఆరు పడకల ప్రాథమిక కేంద్రం తప్ప పెద్ద ఆసుపత్రులు లేకపోవడం, వైద్య సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు స్థానిక ఉండకపోవడంతో భక్తులు, ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి, వైద్యం సరిగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● గుట్టలో త్వరగా మెడికల్ కళాశాలకు స్థలం కేటాయించి మంజూరైన కళాశాల త్వరగా నిర్మాణం చేపట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

● నేడు గుట్టకు వస్తున్న సీఎం సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిన్నంటిని త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్లు కోల్పోయి రోడ్లపై బతుకు అయింది



బస్వాపురం రిజర్వాయర్ ముంపులో మా తండా ఇల్లు, వ్యవసాయ భూములు సకలం కోల్పోయాం. మా బతుకులు రోడ్డుపై పడ్డాయి. ఇప్పటి వరకు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ, 90ఎకరాలకు నష్ట పరిహారం రూ.1.63 కోట్లు ఇవ్వలేదు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి వెంటనే ప్యాకేజీ, పరిహారం అందే విధంగా కృషిచేసి ఆదుకోవాలి.

● బజ్జీనాయక్, లప్పానాయక్ తండా మాజీ సర్పంచ్.

చట్టసభల్లో వాటా కోసం బీసీలు ఉద్యమించాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆత్మకూరు(ఎం) మార్చి 10: చట్ట సభల్లో వాటా సాధన కోసం చేపట్టిన ఉద్యమంలో బీసీలంతా కలిసి రావాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. చట్ట సభల్లో వాటా సాధన కోసం మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన పాదయాత్ర ఆదివారం ఆత్మకూరు(ఎం)మండలానికి చేరుకుంది. బీసీ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ఏళ్ల తరబడి బానిసత్వంలో మగ్గిపోతున్న బీసీ వర్గాలు అభివృద్ధి చెందాలంటే జనాబా దామాషా ప్రకారం చట్టసభల్లో వాటా సాధన కోసం కొనసాగుతున్న బీసీ మహా పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. బీసీలు వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకొని ఐక్యంగా పోరాడితేనే చట్టసభల్లో వాటా సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు వెలుగు వనిత, పటేలు వనజక్క, మేకపోతుల నరేందర్, ఎర్ర శ్రీహరి, బత్తుల సిద్దేశ్వర్, ఎంపీపీ తండ మంగమ్మ, మాజీ సర్పంచులు జె. నగేష్, బీసు చందర్, పి.నర్సయ్య, పి. మల్లేశం, జి. అయిలయ్య, ఏ. మురళీకృష్ణ, శ్రీశైలం, యాదగిరి, అంజయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : సామేలు



మోత్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, మార్చి 10: బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మోత్కూరులో మూతపడిన అంగడి(పశువుల సంత, లైబజార్‌ను)ని మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన అంగడి లాక్‌డౌన్ కారణంగా మూతపడితే గత పాలకులు దాన్ని అలాగే వదిలేశారన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు వారికి కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చారని, అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మోత్కూరు మెయిన్‌రోడ్డును ఎస్‌బీఐ నుంచి పాతబస్టాండ్ వరకు సీసీ, మిగితా రోడ్డంతా బీటీ చేయిస్తానన్నారు. ఇటీవల తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మోత్కూరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరుమలగిరికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరగా వెంటనే జూనియర్ కళాశాల మంజూరు చేశారన్నారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగు నీరందించే బునాదిగాని కాల్వను పూర్తి చేయిస్తానన్నారు. తిరుమలగిరి మండలం తాటిపాముల, అడ్డగూడూరు మండలం జానకిపురం గ్రామాల మధ్య బిక్కేరు వాగులో బ్రిడ్జి నిర్మాణానికి కృషిచేస్తున్నట్టు చెప్పారు. మోత్కూరులో 30పడకల ఆస్పత్రి, మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నా నన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, పైళ్ల సోమిరెడ్డి, డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, సీపీఐ, బీజేపీ, సీపీఎం నాయకులు యానాల దామోదర్‌రెడ్డి, చేడె చంద్రయ్య, కొణతం నాగార్జునరెడ్డి, కూరపాటి రాములు, అన్నెపు వెంకట్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: బిక్కేరుపై ఉండే చెక్ డ్యామ్‌లు త్వరగా పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని ధర్మారం చెక్ డ్యామ్‌ను ఆదివారం పరిశీలించారు. గత కాంట్రాక్టర్ల నిరక్ష్యంతో ఇప్పటికి రెండు, మూడు చెక్ డ్యామ్ కొట్టుకపోయిందన్నారు. ఈ చెక్ డ్యామ్‌ను నెల రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగెస్ నాయకులు వళ్లంభట్ల రవీందర్, కన్నెబోయిన గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

మోత్కూరు, భువనగిరి టౌన్, వలిగొండ, మార్చి 10: సావిత్రి బాయిపూలేను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు కోరారు. సావిత్రి బాయిపూలే వర్ధంతి సందర్భంగా మోత్కూరులోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద బీసీ రిజర్వేషన్ ఆధ్వర్యంలో, యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాల యంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, యూటీఎఫ్ నాయకులు ఎ.సత్తయ్య, దర్శనం వెంకన్న, దోర్నం వెంకన్న, దునక సోమేశ్వర్, తొర్ర ఉప్పలయ్య, సుబ్రమణ్యశర్మ, గుండా మల్లేషం పాల్గొన్నారు. భువనగిరిలో సావిత్రిబాయి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో యాదగిరిగుట్ట డిపో మేనేజర్, డి. శ్రీనివాస్, దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు భట్టు రాంచంద్రయ్య, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సుర్వంగ శివలింగం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ పాల్గొన్నారు. వలిగొండలో జరిగిన కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్‌యాదవ్, సాయిని యాదగిరి, రమేష్, రాంచందర్, బాలరాజు, మధు, మేఘన, చందన పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోటకొండూరు: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోటకొండూరు, ఆలేరు రూరల్, బీబీనగర్, మార్చి 10: మోటకొండూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమేళనం నిర్వహించారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో వంగపల్లి మహేందర్, లోడె చంద్రశేఖర్, భూమండ్ల మహేష్, జివిలికపల్లి వెంకటేష్, జంపాల నాగచందర్, ఎండి మంజూర్, శ్రీకాంత్, మధు, శేఖర్, మమత పాల్గొన్నారు. ఆలేరు రూరల్ మండలంలోని కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, మిస్కిన్, దామోదర్‌రెడ్డి, అంజయ్య, విద్యార్థులు, కవిత, మహేశ్వరీ, ప్రేమలత, సిద్దమ్మ, శ్రీలత, శోభ, రాణి, రాము, రవీందర్, పాల్గొన్నారు. బీబీనగర్‌లో భువనగిరి గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన 1988-1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

కన్నుల పండువగా వేణుగోపాల స్వామి రథోత్సవం



బీబీనగర్: మహాదేవ్‌పూర్‌లో రథం లాగుతున్న భక్తులు

బీబీనగర్, మార్చి 10: మండలంలోని మహాదేవ్‌పూర్ గ్రామంలో కొలువైన వేణుగోపాల స్వామి రథోత్సవ వేడుక ఆదివార ఉదయం కన్నుల పండుగగా సాగింది. స్వామి వారికి హోమం, పూర్ణాహుతి, చక్రతీర్థం, పుష్పయాగం ఉత్సవాలు ముగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు దండెం ప్రభాకర్, తాజామాజీ సర్పంచ్ దేవరకొండ వేణుగోపాల్, ఉత్సవ కమిటీ సభ్యులు రమణమ్మ, బాల్‌రెడ్డి, శివారెడ్డి, రవీందర్, నగేశ్, కొండల్ పాల్గొన్నారు. యాదాద్రి లక్ష్మీనర్సింహ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి యాదాద్రికి బయలు దేరిన లక్ష్మీనర్సింహస్వామి అఖండ జ్యోతి ఆదివారం బీబీనగర్ పట్టణానికి చేరింది. జడ్పీటీసీ గోళి ప్రణీత పింగల్ రెడ్డి, అఖండ జ్యోతి ఆర్గనైజర్ కాసుల సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర(బుగ్గరామన్న) స్వామి దేవాలయం ఉత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో దిష్టికుంభం, రథాంగహోమం నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డం వెంకటేశం, కుక్క కుమార్, గునిగంటి వెంకటేష్‌గౌడ్, కుడికాల భిక్షపతి, చిక్క అశోక్, ఆడెపు భావనాఋషి పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని రెడ్డెరేపాకలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భవానీ శంకరస్వామి ఆలయం వద్ద అగ్ని గుండాలు నిర్వహించారు. పూజారులు శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ముందు ప్రభాను అర్చకులు తరలిస్తుండగా భక్తులు శివనామ స్మరణలతో అగ్నిగుండాలపై నుంచి నడిచి వెళ్లారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ జంగం శంకరయ్య, జడ్పీటీసీ వాకిటి పద్మఅనంతరెడ్డి, రేపాక ప్రదీప్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు చేపట్టిన 30వ అఖండ జ్యోతియాత్ర ఆదివారం రాత్రి భువనగిరికి చేరింది. సావర్కర్ చౌరస్తా వద్ద రథయాత్రకు భక్తులు ఘన స్వాగతం పలికారు. భజనలు, కోలాటాల నడుమ పట్టణంలో రథయాత్ర కొనసాగింది. అఖండ జ్యోతి యాత్ర చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఆబోతుల గండేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రథయాత్ర కొనసాగింది. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ, తదితరులు స్వాగతం పలికి పూజలు చేశారు.



భువనగిరి టౌన్: అఖండ జ్యోతికి స్వాగతం పలుకుతున్న భక్తులు

రామన్నపేట : మండలంలోని నిదానపల్లిలో భమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అంబటి నాగిరెడ్డి, అర్చకులు బేతోజు సత్యనారాయణ, శశిధర్, మదర్ డెయిరీ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ గోగు పద్మ, గుత్త నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..



భువనగిరి రూరల్: భువనగిరి పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తోటకూరి బాలమహేష్ యాదవ్, లింగస్వామి, రాజు, అమర్ తదితరులు ఉన్నారు.

రామన్నపేట: మండలంలోని లక్ష్మాపురంలో యాదవ సంఘ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే వేముల వీరేశంను యాశోద కృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం వినతిపత్రం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నీల నర్సింహ, నీల అయిలయ్య, గొర్ల నరసింహ, నీల నర్సింహ, మాండె కృష్ణ, నీల యాదయ్య, నరేష్, కొండల్, దాసరి మల్లేశం మధు, శివ, సాయి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: తైక్వాండో క్రీడలతో మానసిక ఉల్లాసం, శరీర ధారుడ్యం పెంపొందుతుందని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి కోచ్ కొండ్రెడ్డి శ్రీకాంత్ అన్నారు. స్థానిక దేదీప్య హైస్కూల్‌లో జిల్లా స్థాయి తైక్వాండో బెల్ట్ గ్రేడ్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ టి రంగారావు మాట్లాడుతూ క్రీడలతో క్రమ శిక్షణ ఏర్పడుతుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పదాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధికి పాటుపడాలని ఆలేరు ఎస్ఐ వెంకటశ్రీను అన్నారు. ఆదివారం ఆలేరులోని మజీద్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకు సాగితే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సామిరెడ్డి, గౌస్, ఎజాజ్, రఫీ, లక్ష్మీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలేరు రూరల్: బహుజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని గుండ్లగూడేనికి చెందిన ఎర్ర జాన్‌సన్‌మాదిగ ఎన్నికయ్యారు. సూర్యాపేటలో జరిగిన దళిత మహాసభలో అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యస్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

భువనగిరి టౌన్: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బుల్లెట్ మాధూరి చంద్రను రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి ప్రశంసించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజా క్షేత్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ఇటీవలె నారీశక్తి వందన్ యాత్ర, రన్ ఫర్ నేషన్, రన్‌ఫర్ మోదీ తదితర కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందించారు.

మోత్కూరు: బీఆర్ఎస్ మోత్కూరు పట్టణ మాజీ అధ్యక్షుడు బయ్యని రాజు సొంత గూటికి చేరారు. భువనగిరిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, భువనగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, నాయకులు కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, సోమయ్య, మనోహర్ పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డిని ఆదివారం టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోత్కూరు యాదయ్య, ఫుట్‌బాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవినేని కృష్ణారావు, బుక్క సత్యం, లొడంగి మల్లేష్, మోత్కూరు రాజు, పి.స్వామిరాయుడు సన్మానించారు.

వలిగొండ: మండల కేంద్రానికి చెందిన శివనాదుల రమేష్ గుప్త వాణిజ్య వ్యాపార సంస్థల యజమానుల సంఘం నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా పస్నీరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బెలిదె శ్రీనివాస్‌గుప్త, కోశాధికారిగా చిలుముల రాంరెడ్డి ఎన్నికయ్యారు. శివనాదుల రమేష్‌గుప్త మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార యజమానుల సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిరెడ్డి, నారాయణ, నర్సయ్య, చంద్రమౌళి, లింగస్వామి, డాక్టర్ యాదగిరి, గణేస్, అమరేందర్, ఎస్‌కె షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లికి చెందిన గజ్జెల రామకృష్ణ కవి రచించిన 'దీపం ఉండగానే' కవితా సంకలనానికి 2023 పీచర సునీతారావు తృతీయ స్మారక సాహిత్య పురస్కారం తెలంగాణ సాహిత్య అకాడమి తొలి చైర్మన్ నందిని సిదారెడ్డి నుంచి పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణకు పురస్కారం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కాళోజి అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, ప్రభుత్వ కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ విమర్శకులు, కథకులు కాసుల ప్రతాపరెడ్డి, ప్రముఖ కవి వేముగంటి మురళీకృష్ణ, పి రవీంద్రరావు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపల్లి కాల్వలో పడి వ్యక్తి మృతి

వలిగొండ, మార్చి 10: మండలంలోని ధర్మారెడ్డి కాల్వలో ఆదివారం పడి వ్యక్తి మృతిచెందాడు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం పశుపాములు గ్రామానికి చెందిన భూపాల్‌రెడ్డి(64) తన తల్లి అస్తికలు కలపడానికి వలిగొండ మండలంలోని సంగం గ్రామ పరిధిలోని భీమలింగం వద్దకు సోదరులతో కలిసి వచ్చాడు. సోదరులు తల్లి అస్తికలు కలపడానికి మూసీ నదిలోకి వెళ్లగా భూపాల్‌రెడ్డి మాత్రం సమీపంలో ఉన్న ధర్మారెడ్డిపల్లి కాల్వలో ప్రమాదవశాత్తు పడి చనిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
10
సోమవారం 11 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.134	194	221
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.8



బ్రహ్మోత్సవ శోభ

▸▸ నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు ▸▸ నిత్య, మొక్కు కల్యాణాలు, హోమ పూజలు నిలివేత

ఆర్తత్రాణపరాయణుడు.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు.. కొండ గుహలో స్వయంభువుగా పంచ రూపాల్లో వెలసిన యాదగిరిగుట్ట లక్ష్మీ నారసింహుడి దివ్య సన్నిధి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు సన్నద్ధమైంది. ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి ఫాల్గుణ శుద్ధ ఏకాదశి వరకు 11 రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

\- యాదగిరిగుట్ట

యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టాలైన స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం ఈ నెల 17న, బ్రహ్మోత్సవ తిరుకల్యాణోత్సవం 18న, దివ్యవిమాన రథోత్సవం 19న నిర్వహించనున్నారు. ప్రధానాలయ ఉద్ఘాటన అనంతరం స్వయంభువు సన్నిధిలో జరగనున్న రెండో వార్షిక బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే గాక దేశవిదేశాల నుంచి భక్తులతో పాటు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో రానున్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

\- ఈవో రామకృష్ణారావు



లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవ వైదిక పర్వాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం కొండపైన దేవస్థాన ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలను రూ.1.60 కోట్ల బడ్జెట్‌తో నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో రూ.60లక్షలు విద్యుద్దీపాలంకరణలకు, మిగిలిన కోటి రూపాయలు పూజా కైంకర్యాలతో పాటు ఉత్సవాల నిర్వహణకు కేటాయించినట్టు చెప్పారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించేలా చలువపందిళ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. భక్తుల రద్దీకి సరిపడా ప్రసాదాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ప్రధానాలయంతో పాటు ఆలయ గోపురాలకు విద్యుద్దీపాలంకరణలు చేశామని, ప్రధాన రహదారులు, మెట్లమార్గం, ఆలయ ఘాట్‌రోడ్‌లో విద్యుద్దీపాలు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈ నెల 17న స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుట నిర్వహిస్తామన్నారు. తిరుకల్యాణానికి ప్రధానాలయ ఉత్తర దిశలోని తిరుమాడవీధిలో కల్యాణవేదిక ఏర్పాటుచేసి నిర్వహిస్తామన్నారు. సుమారు 5 వేల మంది భక్తులు పట్టేలా మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ నెల 18న రాత్రి వేళ స్వామివారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవ కల్యాణ టికెట్లను 600 మాత్రమే విక్రయిస్తామని, భక్తులు రూ. 3000 రుసుము చెల్లించి ఈ టికెట్లు పొందాలన్నారు. ఈ నెల 19న ఆలయ తిరువీధుల్లో నిర్వహించే దివ్యవిమాన రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు.

అందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నిత్య, మొక్కు కల్యాణాలు, సుదర్శన హోమ పూజలు నిలిపివేత

యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి సన్నిధి లో ఈ నెల 11 నుంచి 21 వరకు కొనసాగనున్న వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు స్వామి వారి నిత్య, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హవన పూజలను నిలిపివేయనున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ 11 రోజుల పాటు రాత్రి వేళ నిత్యార్చనల అనంతరం రాత్రి 8.15 నుంచి 9గంటల వరకు బలిహరణం, రాత్రి నివేదన నిర్వహిస్తారు. రాత్రి వేళ 8గంటలకు అలంకార తిరువీధి సేవలు, సర్వ దర్శనాలు ఆరంభించి 10గంటలకు శయనోత్సవ దర్శనం, ఆలయ ద్వారబంధనం చేస్తారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నిత్యార్చనలు, భోగములు, 20, 21వ తేదీల్లో భక్తులు నిర్వహించే అభిషేకం, నిత్యార్చనలు రద్దు చేసినట్టు అధికారులు ప్రకటించారు. కాగా, స్వామి సన్నిధిలో మొక్కు సేవలు ఈ 11రోజుల పాటు సా యంత్రం 4నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

● ఉదయం 10గంటలకు విశ్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాసూత్రధారణలతో తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం పలుకుతారు. సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ

విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానాలు

యాదగిరీశుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో విశే ష ఘట్టం చక్రతీర్థ పుణ్యస్నానం భక్తులందరికీ కొండపైన విష్ణుపుష్కరిణిలోనే కల్పించనున్నారు. గతంలో ఆలయ ఉద్ఘాటనకు ముందు కొండపైన సహజ సిద్ధమైన స్వామివారి విష్ణుపుష్కరిణిలో అర్చకస్వాములు చక్రరాజం సుదర్శన చక్రానికి అవభృతస్నానం ఆచరించిన అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేవారు.అయితే కొండకింద గండిచెరువు సమీపంలో భక్తుల పుణ్యస్నానాల కోసం లక్ష్మీ పుష్కరిణి నిర్మించిన అధికారులు తొలిసారి బ్రహ్మోత్సవాల్లో చక్రతీర్థస్నానాలు లక్ష్మీపుష్కరిణిలోనే కల్పించారు. కాగా, ఈ ఏడాది మాత్రం భక్తులందరికీ చక్రతీర్థ పుణ్యస్నానాలు కొండపైన విష్ణుపుష్కరిణిలో అనుమతించడం విశేషం.

తాత్కాలిక వేదికపై బ్రహ్మోత్సవ తిరుకల్యాణం

విశ్వవిఖ్యాత దివ్యక్షేత్రధామంగా, వేల కోట్ల రూపాయలతో తిరుమలతరహాలో పునర్నిర్మించిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తాత్కాలిక వేదికపైనే బ్రహ్మోత్సవ తిరుకల్యాణం నిర్వహించనున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో స్వామివారి నిత్యతిరుకల్యాణం, హోమ పూజల నిర్వహణకు ప్రత్యేకంగా మండపాల నిర్మాణం లేకపోవడంతో అష్టభుజి ప్రాకార మండపంలోనే నిర్వహిస్తున్నారు. శాశ్వత యాగశాల, కల్యాణమండపాల నిర్మాణం లేకపోవడంతో అష్టభుజి ప్రాకార ఉత్తర దిశలోని మండపంలో తాత్కాలిక యాగశాలలో హవన పూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఉత్తర దిశలోని ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక ఏర్పాట్లతో స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణ వేదికను నిర్మించనున్నారు. ఈ కల్యాణ వేదికపైనే ఈ నెల 18న లక్ష్మీనృసింహుడి కల్యాణం నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు

నేడు సమర్పించనున్న చేనేత సంఘం నాయకులు



భూదాన్‌పోచంపల్లి: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు సిద్ధమయ్యాయి. అమ్మవారు లక్ష్మీదేవిని పద్మశాలీలు ఆడపడుచుగా భావిస్తారు. దీంతో పద్మశాలీ కుటుంబాలు అత్యధికంగా ఉన్న భూదాన్‌పోచంపల్లిలో పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా స్వామివారి బ్రహ్మోత్సవాలకు లక్ష్మీదేవి అమ్మవారికి పట్టుచీరలు, స్వామివారికి పట్టు పంచె, శాలువాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జీవో కూడా జారీ చేసింది. భూదాన్‌పోచంపల్లి పట్టుచీరలు, వస్త్రాలు సమర్పించేందుకు ఈవో అనుమతినిచ్చారు. ఈ నేపథ్యంలో 15 రోజులుగా పద్మశాలి మహాజన సంఘం భవనంలో మగ్గం ఏర్పాటు చేసి నియమ నిష్ఠతో చేనేత కళాకారుడు మేకల రామకృష్ణ ఈ వస్త్రాల తయారీలో నిమగ్నమయ్యారు. వీటికి సోమవారం ఉదయం స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి ఆధ్వర్యంలో చేనేత సంఘం నాయకులు, మార్కండేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ బడుగు చండికేశ్వర్‌తో కలిసి యాదగిరిగుట్టలో సమర్పించనున్నారు.

నేడు గుట్టకు సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం హోదాలో తొలిసారిగా



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం దర్శించుకోనున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సారిగా ఆయన ఇక్కడికి రానున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం సీఎం పర్యటన ఏర్పాట్లను పూర్తిచేసింది. ఇప్పటికే కొండకింద పాత గోశాల ప్రాంతంలో హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు కొండపైకి భక్తుల వాహనాలు, స్వయంభువుల దర్శనాలకు భక్తులను అనుమతించడం లేదని దేవస్థాన అధికారులు తెలిపారు. సీఎం ఉదయం 8.45గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఉదయం 9గంటలకు కొండకింద పాతగోశాల సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.అక్కడినుంచి రోడ్డు మార్గంలో మూడో ఘాట్‌రోడ్ మీదుగా కొండపైకి చేరుకుంటారు. కొండపైన వీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుని పడమటి దిశలోని లిఫ్టు నుంచి ఉత్తర తిరుమాడవీధిలోనికి చేరుకుంటారు. ఉత్తర పంచతల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి ప్రవేశిస్తారు. ప్రధానాలయ ముఖమండపంలోని ధ్వజస్తంభానికి మొక్కి, గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని మొక్కు చెల్లిస్తారు. అనంతరం ప్రధానాలయ ముఖమండపంలో బ్రహ్మోత్సవ తిరుకల్యాణంలో తొలి రోజు స్వస్తిపుణ్యాహవాచన పూజల్లో పాల్గొంటారు. సుమారు గంట పాటు పాల్గొని తిరుకల్యాణోత్సవానికి స్వామి, అమ్మవార్లకు అలంకరించే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేస్తారు. పూజల అనంతరం అతిథి గృహానికి చేరుకుని అక్కడినుంచి తిరిగి కాన్వాయ్‌లో కొండకింద పాతగోశాల హెలీప్యాడ్ వద్దకు వెళ్తారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు రానున్నారు. కాగా, యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో ఇప్పటి వరకు నలుగురు సీఎంలు స్వామి, అమ్మవార్లకు కల్యాణ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. టి.అంజయ్య, మర్రి జనార్దన్‌రెడ్డి, నందమూరి తారకరామారావు, కేసీఆర్ తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.



తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

రాజకీయ వేడి

▸▸ దూకుడుమీదున్న కమలదళం
▸▸ కాషాయకండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి
▸▸ నల్లగొండ అభ్యర్థిగా ఆయనకు గ్రీన్‌సిగ్నల్..!
▸▸ బలమైన అభ్యర్థుల్నే బరిలో దించేందుకు గులాబీదళం వ్యూహం

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు గడువు సమీపిస్తుండడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాజకీయవేడి పెరిగింది. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్న బీజేపీ, తొలి జాబితాలోనే భువనగిరి పార్లమెంట్ స్థానానికి మాజీ ఎంపీ, బీసీనేత డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు టికెట్‌ను ప్రకటించింది. నల్లగొండ లోక్‌సభ స్థానంపైనా కన్నేసిన ఆ పార్టీ బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని ఆదివారం పార్టీలో చేర్చుకోవడంతో పాటు, ఆయనకు టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం హామీ ఇచ్చింది. నేడో, రేపో వెలువడే పార్టీ రెండో జాబితాలో నల్లగొండ అభ్యర్థిగా సైదిరెడ్డిని ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించడంతో ఉమ్మడి జిల్లాపై కమలదళం ప్రత్యేకంగా దృష్టి సారించిన విషయం బలపడుతోంది. రెండురోజుల క్రితం వరకు పార్టీ మారేందుకు ససేమిరా అని పేర్కొన్న సైదిరెడ్డి బీజేపీ అధిష్ఠానం నేరుగా రంగంలోకి దిగి చర్చలు జరపడంతో ఆదివారం బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీలు నగేశ్, సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుతో కలిసి బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. సైదిరెడ్డి బీజేపీ అభ్యర్థిగా దాదాపు ఖరారవడంతో బీజేపీ ఉమ్మడి జిల్లాలో రెండు స్థానాలకు బలమైన అభ్యర్థులనే రంగంలోకి దింపి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు సవాల్ విసురుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో భారీ విజయాలు సాధించిన కాంగ్రెస్ నల్లగొండ అభ్యర్థిగా పీసీసీ ప్రధానకార్యదర్శిగా కుందూరు రఘువీర్‌రెడ్డికి టికెట్ ప్రకటించగా, భువనగిరి స్థానంలోనూ బలమైన అభ్యర్థినే బరిలో దింపే సంకేతాలిస్తోంది. బీఆర్‌ఎస్ మాత్రం ఇంకా అభ్యర్థులను ప్రకటించకపో గా, ఆ పార్టీకి చెందిన పూర్వనేతలనే బీజేపీ అభ్యర్థులుగా రంగంలోకి దించుతుండడంతో గులాబీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా అంతా భావిస్తున్నారు. అధిష్ఠానం, ముఖ్యనేతలు మాత్రం కాంగ్రెస్, బీజేపీకి దీటైన అభ్యర్థులను నిలుపుతామని ప్రకటిస్తోంది. మొత్తంగా రెండు రోజుల్లో టిక్కెట్ల వ్యవహారం కొలిక్కిరానుండడంతో ఆసక్తికర రాజకీయాలు కనిపించనున్నాయి.

బీఆర్‌ఎస్‌లో 'గుత్తా' కలకలం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి తాను ఈ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని బీఆర్‌ఎస్ అధిష్ఠానానికి తెలియజేయడం ఆ పార్టీలో రాజకీయ దుమారం లేపింది. అసెంబ్లీ ఎన్నికల ఘట్టం ముగిసినప్పటి నుంచి అమిత్ బీఆర్‌ఎస్ తరపున నల్లగొండ లేదా భువనగిరి స్థానాల్లో అధిష్ఠానం ఎక్కడ పోటీచేయమంటే అక్కడ నిలుస్తానని పేర్కొన్న అమిత్‌రెడ్డి, తాజాగా పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటించడం వెనక పార్టీలో అంతర్గత విభేదాలే కారణంగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని, కీలక నేతను కలిశారని చర్చ జరిగినా, అలాంటి సమావేశమేదీ జరగలేదని, తాను బీఆర్‌ఎస్‌ను వీడడం లేదని, ఇదంతా ఊహాగానమేనని అమిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అమిత్‌రెడ్డిని పోటీచేయకుండా ఎవ్వరూ అడ్డుకోవడం లేదని, పోటీ చేస్తానని తానే ప్రకటించుకున్నారని, ఇప్పుడు అడ్డుకుంటున్నారని చెప్పడమేంటని వ్యాఖ్యానించడం రాజకీయంగా చర్చకు దారితీసింది. రెండురోజుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటిస్తామని జగదీ‌ష్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నుంచి నల్లగొండ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, ఉద్యమనేత చాడకిషన్‌రెడ్డి, బీసీవర్గానికి చెందిన సుంకరి మల్లేశ్‌గౌడ్, ఎస్టీవర్గానికి చెందిన డాక్టర్ మాతృనాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. భువనగిరి స్థానం నుంచి ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, క్యామ మల్లేశ్ తదితరుల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

భువనగిరి కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ

కాంగ్రెస్ నుంచి తొలి జాబితాలోనే నల్లగొండ స్థానానికి మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డికి టికెట్ కేటాయించిన పార్టీ అధిష్ఠానం భువనగిరి సీటుపై తీవ్ర కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. తమకు పట్టున్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ తమ కుటుంబానికి చెందిన వారికే టికెట్ ఇవ్వాలని కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టుబడుతున్నట్టు సమాచారం. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి, కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సూర్యపవన్‌కుమార్‌రెడ్డిలో ఒకరికి టికెట్ వస్తుందని కోమటిరెడ్డి వర్గీయులు చెబుతున్నారు. మరోవైపు ఈ స్థానంలో పోటీచేసేందుకు పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత, పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ తదితరులు కూడా టికెట్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఈ టికెట్ విషయం అధిష్ఠానం తేల్చేస్తుందని, పార్టీ వ్యూహకర్త సునీల్‌కనుగోలు బృందం నిర్వహించే సర్వే కూడా అభ్యర్థి ఎంపికలో కీలకమవుతుందని పార్టీ ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీలో చేరిన శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 10: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత శానంపూడి సైదిరెడ్డి ఆదివారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. సైదిరెడ్డికి తరుణ్‌చుగ్ బీజేపీ సభ్యత్వాన్ని అందజేశారు. బీఆర్‌ఎస్ నుంచి నల్లగొండ ఎంపీ టికెట్ కోసం సైదిరెడ్డి ప్రయత్నించగా, ఆ పార్టీ నిరాకరించిందని, బీజేపీ నుంచి అవకాశం ఇస్తామని హామీ ఇవ్వటంతో ఆయన ఆ పార్టీలో చేరినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో చేరిన సైదిరెడ్డి ఆ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై 7,600ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించడంతో, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో 2019 అక్టోబరులో జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన సైదిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డిపై 43,435ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2023 నవంబరు 30న జరిగి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి 44,888ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటినుంచి కొంతకాలం స్తబ్దుగా ఉన్న సైదిరెడ్డి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

శాస్త్రీయ విధానంతో చెరువుల అభివృద్ధి

▸▸ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ▸▸ లేక్ మ్యాన్ ఆఫ్ ద సిటీ ఆనంద్‌తో కలిసి చెరువుల పరిశీలన



లక్కారం చెరువు పరిస్థితిని ఇంజనీర్ ఆనంద్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


చౌటుప్పల్ టౌన్, మార్చి 10: వేసవిలో సైతం నీటి నిల్వలు ఉండేందుకు గొలుసుకట్టు చెరువులను శాస్త్రీయ విధానంతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్టు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మునిసిపాలిటీలోని చౌటుప్పల్, లక్కారం, తంగడపల్లి చెరువులను బెంగుళూరుకు చెందిన లేక్ మ్యాన్ ఆఫ్ ద సిటీగా పేరొందిన ఆనంద్ మలెగంతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం చెరువులు, కుంటలను పట్టించుకోకపోవడం వల్లే వేసవిలో నీరు ఉండడం లేదన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా చెరువులు, కుంటలకు మళ్లించడం ద్వారా భూగర్భజలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటి సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నీటిపారుదలశాఖ అధికారుల లెక్కల ప్రకారం మునిసిపాలిటీతో పాటు మండలంలో 53 చెరువులు, కుంటలు ఉన్నాయని, వాటిలోని నీటి నిల్వలు, భూముల విస్తీర్ణం తదితర వివరాలను అందజేయాలని అధికారులకు సూచించామన్నారు. ప్రస్తుత వేసవిలో మూడు నెలల్లో మునిసిపాలిటీలోని చెరువుల అభివృద్ధి పనులు చేపడతామన్నారు. శాస్త్రీయ విధానంతో చేపట్టే వీటి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు సహకరించాలని కోరారు. చౌటుప్పల్‌లో హైదరాబాద్ మహాప్రస్థానం వంటి సౌకర్యాలతో ప్రత్యేక శ్మశాన వాటికను నిర్మిస్తామన్నారు. ఇక్కడి చెరువులను పరిశీలించేందుకు ఆనంద్ మలెగం సమయం కేటాయించడంపై అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఐబీ డీఈ కృష్ణారెడ్డి, ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కొయ్యడ సైదులు, కాసర్ల శ్రీనివా‌స్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజు, సుర్వి నర్సింహ, బి.మురళి, ఉబ్బు వెంకటయ్య, ఎం.రమే‌ష్‌గౌడ్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, కొంతం బుచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం

సంస్థాన్‌నారాయణపురం: చెరువు, కుంటల అభివృద్ధి ద్వారా వ్యవసాయ భూములకు సాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ అటవీ ప్రాంతంలోని మేళచెర్వు చెరువును ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి, ప్రేమ్‌చందర్‌రెడ్డి, ఏపూరి సతీష్, ఉప్పల లింగస్వామి, మందుగుల బాలకృష్ణ, కున్‌రెడ్డి నర్సింహ, పాలకూర్ల యాదయ్య, పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీరోడ్లును పూర్తి చేస్తాం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సీసీరోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 10: గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో గ్రామాల్లో నిలిచిన సీసీరోడ్ల పనులను పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం గుట్ట మండలంలోని చొల్లేరు, మల్లిగూడెం, రామాజీపేట, చిన్న, పెద్ద కందుకూర్లు, బాహుపేట, తాళ్లగూడెం, యాసోజిగూడెం, కుమ్మరిగూడెం, మా సాయిపేట, చిన్నగౌరాయిపల్లి, కాచారం, సాదువెల్లి, కంఠంగూడెం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.80కోట్లతో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, మిగతా గ్యారంటీలను సైతం త్వరలో అమలు చేస్తామన్నారు. నియోజవర్గంలో సమస్యలన్నీ తీరుస్తానని, సీఎం సహకారంతో నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధ, బీరయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లే‌ష్‌యాదవ్, బందారపు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమికి 400 సీట్లు

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

భువనగిరి టౌన్, మార్చి 10: పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమికి 400 సీట్లు వస్తాయని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ విజయాన్ని అడ్డుకునేందుకు ఇండియా కూటమి చేస్తున్న ప్రయత్నాలన్నీ వృథా అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనను దేశం మరోమారు కోరుకుంటున్నదని, మోదీ నాయకత్వాన్ని అడ్డుకునే శక్తి ఎవ్వరికీ లేదన్నారు. రాష్ట్రంలో గతం కంటే మెరుగైన సీట్లు సాధిస్తామన్నారు. ఆ విజయోత్సవంలో భువనగిరి నియోజకవర్గాన్ని కూడా నిలిపే బాధ్యత కార్యకర్తలదన్నారు. అయోధ్య రామ మందిరం నిర్మాణం, ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్ రద్దు తదితర సంచలన నిర్ణయాలతో పాటు మోదీ పాలనతో బీజేపీ గెలుపు ఖాయమైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

భువనగిరి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ, దేశాన్ని అగ్ర రాజ్యంగా తీర్చేందుకు పదేళ్లుగా శ్రమిస్తున్న ప్రధాని మోదీకి అండగా నిలిచే సమయం భువనగిరి నియోజకవర్గ ప్రజలకు ఆసన్నమైందన్నారు. మూడోసారి ప్రధాని మోదీయేనని ఈ పాటికే స్పష్టమైన నేపథ్యంలో భువనగిరి బీజేపీ ఎంపీని గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడుతుందని, ఇప్పటి నుంచే కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని, ఇంటింటా ప్రచారం ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం భాస్కర్, యన్నం శివకుమార్, ఊట్కూరి భాస్కర్‌గౌడ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, పార్లమెంట్ కన్వీనర్ లింగస్వామి, పి.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులు కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

యాదగిరిగుట్ట రూరల్: హమాలీ కార్మికుల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ఆదివారం గుట్టలో హమాలీ కార్మికుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుట్టలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి చాయ్ పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు పడాల శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యనారాయణ, రచ్చ శ్రీనివాస్, చిరిగె శ్రీనివాస్, అశోక్, అచ్చయ్య, శ్యామ్‌సుందర్, ప్రభాకర్, కర్రె శ్యామ్, పాల్గొన్నారు.